క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే చికిత్స చేయించుకోవాలని మలేరియా డివిజనల్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. ఎం.తోటూరులో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో శుక్రవారం వైద్య సిబ్బందితో కలసి గ్రామంలో యాంటీ లార్వా మందును వీధుల్లో, కాలువల్లో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ కొబ్బరి బొండాలు, తినుబండారాల కాగితాలను వెంటనే తీసి పారవేయాలని అన్నారు. స్థానిక నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ, ఆశవర్కర్లు ఉన్నారు.

అండర్ పాసెజ్‌కు స్థలపరిశీలన


స్థలపరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీకి వెళ్లేందుకు అవసరమైన అండర్‌పాసెజ్ ఏర్పాటు కోసం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం స్థలపరిశీలన చేశారు. పాతాళసిద్ధేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ కాలనీకి పట్టణం నుంచి రాకపోకలు సాగించేందుకు అండర్‌పాసేజ్ నిర్మాణానికి పలాస నుంచి రైల్వే అధికారులు వచ్చి బాహుదానది రైల్వే బ్రిడ్జి సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు వీరితో స్థానిక రైల్‌యూజర్ కమిటీ సభ్యులు కలిసి అండర్ పాసెజ్ ఆవశ్యకతను అధికారులకు వివరించారు. రైల్ యూజర్ కమి సభ్యులు బత్తుల బాబు, డి.గోపాల్‌రావు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 11 ఫిర్యాదులు అందాయి. సివిల్‌కు సంబంధించి ఒకటి, కుటుంబ కలహాలపై ఒకటి, పాత ఫిర్యాదులపై ఒకటి, పరిపాలన అంశాలపై రెండు, ఇతర సమస్యలపై ఆరు వినతులు అందాయి. ఎస్పీ మాట్లాడుతూ..వీటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేసాతమన్నారు.

డయేరియా మృతుల కుటుంబాలకు నేడు సీదిరి పరామర్శ

కాశీబుగ్గ: విజయనగరం జిల్లా గుర్ల మండలం కేంద్రంలో డయేరియాతో పలువురు మృతి చెందారు. వీరి కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ఉదయం పరామర్శించనున్నారు.

అలరించిన హరివిల్లు


పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలపై ఇంద్రధనస్సు

కాశీబుగ్గ: రంగుల హరివిల్లు కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీ వాసులను శుక్రవారం ఉదయం అలరించింది. ఉదయాన్నే పట్టణంలో దర్శనం ఇవ్వడంతో దీన్ని సెల్‌ఫోన్లలో బంధించేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

పోషకాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: పోషకాల గనిగా, ఆరోగ్య ప్రదాయినిగా మునగాకు ప్రసిద్ధి పొందిందని రూరల్ ఐసీడీఎస్ పీవో పురాణం నాగరాణి అన్నారు. 'మోరింగ డే' సందర్భంగా శుక్రవారం ఇచ్ఛాపురం రూరల్ సెక్టార్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో మునగాకు వలన కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు.


అధ్వానంగా ఉన్న రోడ్డు

- అవస్థలు ఎదుర్కొంటున్న మేఘవరం పంచాయతీ గిరిజనం
- నిరుపయోగంగా వాటర్ ట్యాంకు
- కానరాని పారిశుద్ధ్యం


భీంపురంలో కాలువల్లేక అధ్వానంగా ఉన్న వీధిరోడ్డు

మౌలిక వసతులు ఎండమావే!

టెక్కలి రూరల్:

ప్రభుత్వాలు ఎన్నిచర్యలు చేపడుతున్నా చాలా గ్రామాలు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. మౌలిక వసతులు ఎండమావిగానే మిగులుతున్నాయి. ప్రధానంగా గిరిజన గ్రామాల్లో పరిస్థితి ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్నచందనంగా మిగిలింది. ప్రస్తుత ప్రపంచం టెక్నాలజీతో పోటీపడుతూ ముందుకు సాగుతుంటే కొన్ని గిరిజన గ్రామాలకు ఇప్పటికీ సెల్‌ఫోన్ సిగ్నల్ అందని పరిస్థితి. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. ఈ పంచాయతీ పరిధిలో మేఘవరంతోపాటు జక్కరపేట, జీడిపేట, చిన్నభీంపురం, వంగర, భీంపురం, సరియాపల్లి, డెప్పూరు, కోదండపురం, కొండమీదకొత్తూరు తదితర గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు నాలుగు వేల మంది జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ గ్రామాల్లో నేటికీ సరైన మౌలిక వసతుల్లేవు. మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు సైతం లేకపోవడంతో వాడుక నీరు ఇళ్లముందే నిలిచిపోతుంది. అలానే గ్రామాల మధ్యలోనే పెంట కుప్పలు పేరుకుపోవడంతో దోమలు విజృంభించి రోగాలబారిన పడుతున్నామని గిరిజనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంగర, భీంపురం గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలు కొద్ది నెలలుగా మూలకు చేరడంతో మంచినీటి కోసం కటకటలాడుతున్నారు. ఈ రెండు మంచి నీటి ట్యాంకుల ద్వారా ఐదు గ్రామాలకు మంచినీరు అందేదని.. ప్రస్తుతం మరమ్మతులకు గురికావడంతో నీటికి అవస్థలు పడుతున్నామని వాపోయారు. అలాగే ఆయా గ్రామాలకు వచ్చే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో టెక్కలి నుంచి ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. అయితే రోడ్డు బాగోలేదనే కారణంతో బస్సు సౌకర్యం నిలిపివేయడంతో గిరిజన గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గిరిజనులు పండించే వివిధ పంటలు అమ్ముకోవాలన్న, వైద్యం కోసం టెక్కలి రావాల్సిందే. అయితే బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సును పునరుద్ధరించాలని పలుమార్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినప్పటికీ ఆర్టీసీ అధికారుల నుంచి స్పందన లేకుండా పోయింది. అలాగే ఈ గిరిజన గ్రామాలు కొండల మధ్యలో ఉండడంతో సైల్ ఫోన్ సిగ్నల్ సైతం సరిగ్గా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. ఎవరికైన అత్యవస పరిస్థితుల్లో ఫోన్ చేయాలంటే గ్రామ శివారులో ఎత్తైన ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జక్కరపేట, కోదండపురం గ్రామాల వద్ద సెల్ టవర్లు ఏర్పాటు చేసినప్పటికీ అనివార్య కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు.


భీంపురం గ్రామం మధ్యలో పెంటకుప్పలు


బస్సుల్లే పరిమితి మించికి ఆటోలో వెళ్తున్న గిరిజనులు

బస్సు సౌకర్యం కల్పించండి



మా గిరిజన గ్రామాలకు గతంలో టెక్కలి నుంచి వీరన్నపేట వరకు బస్సు సౌకర్యం ఉండేది. రోడ్డు బాగోలేదనే కారణంతో నిలిపి వేశారు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. టెక్కలి వెళ్లి వచ్చేందుకు 50 రూపాయలు ఖర్చు అవుతుంది. అధికారులు స్పందించి బస్సును పునః రుద్ధరించాలి.

– లంబ పురుషోత్తం, జీడిపేట

నీరు లేక అవస్థలు



మా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం మూలకు చేరింది. దీంతో మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నాం. నీటి కోసం సమీప బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. అయితే ఆ నీరు బురదగా ఉంటుంది. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– కన్నయ్యపేట దమయంతి, వంగర

పరిశీలిస్తాం



కొద్దిరోజులుగా గిరిజన గ్రామాలకు బస్సు సేవలను నిలిపి వేశారు. కారణం నాకు తెలియదు. రికార్డులు పరిశీలించిన తరువాత బస్సు సేవల పునఃరుద్ధరణపై ఆలోచిస్తాం.

– ఎన్ శ్రీనివాసరావు, టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

కాశీబుగ్గ: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు అన్నారు. ఆ పార్టీ పలాస శాఖ మహాసభలు స్థానిక కార్యాలయంలో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా సీపీఎం జెండాను ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగమణి ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహనరావు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తున్న తాము మరిన్ని పోరాటాలు రూపకల్పనకు ఈ సభలు జరుపుతున్నట్టు చెప్పారు. హుద్‌హుద్, టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని, ఆఫ్ షోర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి మున్సిపాలిటీకి మంచినీరు అందించాలని, పెండింగ్‌లో ఉన్న రైల్వే ఫైఓవర్ పూర్తి చేయాలని, జీడి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. నాయకులు ఎన్.గణపతి, అజయ్‌కుమార్, కృష్ణారావు, పరుశురామ్, జన్ని భాగ్యలక్ష్మి, లావణ్య, రజని, నిర్మల పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎన్నికల హామీలను చేయాలి

కాశీబుగ్గ: జీడి రైతులకు ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రైతు ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తామని, జీడి అభివృద్ధి బోర్డు, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నార. బస్సు యాత్ర సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా ఇదే హామీ ఇచ్చి ఉన్నారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కోనారి మోహనరావు, తమ్మినాన భాస్కరరావు, ఆర్లి దానేష్, మడ్డు రాఘవరావు, ఎంపల్ల కామేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్‌కుమార్

జీడి బోర్డు ఏర్పాటుకు కృషి

పలాస: పలాస ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న జీడి బోర్డు ఏర్పాటుకు తగిన కృషి చేస్తానని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు చెప్పారు. చైర్మనణగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా శుక్రవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పదవి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష,కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే పనులను చేస్తానని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధికి కావలసిన అన్ని రకాల అవకాశాలను ఉపయోగించి పలాస అభివృద్ధికి పాటుపడతానిన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోండి

నందిగాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ ఓటర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సోమేశ్వరరావు సూచించారు. మండల పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులు మాత్రమే నవంబర్ 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైనలో తహసీల్దార్ కార్యాలయంలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

మరువాడలో జంగిల్ క్లియరెన్స్

సంతబొమ్మాళి: మరువాడలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు శుక్రవారం చేపట్టారు. ఆర్.మరువాడ గ్రామం నుంచి ఎం.మరువాడ బస్‌స్టాప్ వరకు ఉన్న పొదలను జేసీబీతో తొలగించారు. మాజీ సర్పంచ్ కర్రి రామిరెడ్డి, సురాడ ధాసురాజు, తిప్పాన వసంతరెడ్డి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి

ఇచ్ఛాపురం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యలను మెరుగుపర్చేలా ఉపాధ్యాయులంతా కృషిచేయాలని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు సూచించారు. మున్సిపాలిటి పరిధి పురుషోత్తపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి చదువుపై ఆరా తీశారు. పాఠశాల హెచ్‌ఎం వై.లత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

108 వాహనం పరిశీలన

కాశీబుగ్గ: పలాస మండల కేంద్రంలోని 108 వాహనాన్ని డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం'


మాట్లాడుతున్న కల్యాణ చక్రవర్తి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలంలోని భూ కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి చెప్పారు. అందుకు తనతోపాటు పలాస ఎంపీడీవో, కాశీబుగ్గ సీఐతో కలిపి కమిటీని నియమించినట్టు చెప్పారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు కేవలం ఆరు నెలలు మాత్రమే సమయం ఉందని, ఆ తర్వాత పదోన్నతి ఉంటుందని, అందు చేత ఈ ఆరు నెలల్లో మొత్తం ప్రభుత్వం భూమిని ప్రభుత్వానికి అప్పగించడానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన నేపథ్యంలవో రెవెన్యూపై తగిన అవగాహన ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వానికి కేంద్రీయ విద్యాలయం, స్టేడియం, ఆర్డీవో కార్యాలయం, ఇండస్ట్రీల కోసం భూమి అవసరం ఉందన్నారు. వీటిని సేకరించే పనిలో ఉన్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా భూఆక్రమణలను తొలగిస్తామని, ఎవరైనా ఎదురు తిరిగితే క్రిమినల్ కేసులు కూడా పెడతామని స్పష్టం చేశారు.

వసతి గృహాన్ని సందర్శించిన జడ్జి


టెక్కలి: వసతి గృహంలో సదుపాయాలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు


కోటబొమ్మాళి: విద్యార్థితో చదివిస్తున్న ప్రసన్నలత

టెక్కలి: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించడంతోపాటు మౌలిక సదుపాయాల్లో ఎటువంటి లోపం లేకుండా చూడాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) జె.శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి బీసీ బాలుర మేనేజ్‌మెంట్ వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. వసతి గృహం పరిసరాలు, వంట గది, ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు అందజేయాలని పేర్కొన్నారు. వసతి గృహం సిబ్బంది ఉన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక బీసీ వసతి గృహాన్ని కోటబొమ్మాళి జనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో పాఠాలు చదివించారు. విద్యా బోధనపై పిల్లలతో మాట్లాడి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రఘువర్మ

పలాస: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రభుత్వానికి విన్నవించారు. బ్రాహ్మణతర్లా, రంగోయి, బొడ్డపాడు, రెంటికోట తదితర పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయలపై యాప్‌ల భారం లేకుండా చూడాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సిలబస్ ఉండాలని, తెలుగు మాధ్యమం కొనసాగాలని, పాఠశాలలకు గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రామానాయుడు, ప్రధాన కార్యదర్శి టి.వి.ఎస్.నారాయణ, కె.గోపాలకృష్ణ, పి.వి.రమణ పాల్గొన్నారు.

డిసెంబర్ 14న లోక్ అదాలత్


మాట్లాడుతున్న కిశోర్‌బాబు

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయ సేవాసంఘం మండల అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు అన్నారు. స్థానిక కోర్టుల సముదాయంలో సోంపేట, ఇచ్ఛాపురం పోలీసు అధికారులతో లోక్‌అదాలత్‌పై శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్టేషన్ పరిధిలోని కేసులను గుర్తించడంతోపాటు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. కేసులు రాజీ అయ్యేలా కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్, కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం, సోంపేట సర్కిల్ స్టేషన్ పరిధిలోనిసీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

సోంపేట: తమ సమస్యలను పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోంపేట ఎల్ఐసీ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. పాలసీపై బోనస్ పెంచాలని, పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎజెంట్స్ కమీషన్ పెంచాలి, క్లా బ్యాక్ క్లాజ్ రద్దు చేయాలి, పాలసీలను పాతపద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏజెంట్లు వై.వసంతరావు, జి.పద్మలోచన, జి.రామ్మూర్తి, ఎం.మురళి, బి.కుమారస్వామి పాల్గొన్నారు.

కాశీబుగ్గ: న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పలాసలోని ఎల్ఐసీ బ్రాంచ్ ఆవరణలో ఏజెంట్లు నిరసన తెలియజేశారు. ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు జినగ రాజేంద్రనాయుడు, సెక్రటరీ నాగేశ్వరరావు, ట్రెజర్ వాసుదేవ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైతాంగ సదస్సును విజయవంతం చేయండి

పలాస: మందస మండలం హరిపురం బాలిగాం కూడలిలో పలాస డివిజన్ రైతాంగ సమస్యల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న రైతాంగ సదస్సును విజయవంతం చేయాలని కమిటీ నాయకులు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ మేరకు పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో శుక్రవారం పర్యటించి కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. జీడి, కొబ్బరిపంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, సాగునీటి సదుపాయం కల్పించాలని, వంశధార ఎడమ కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. సంఘం నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, జోగి కోదండరావు, రాపాక చిన్నారావు ఉన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

సోంపేట: మండలంలో ఉన్న 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతోపాటు సమాజంలో సాధికారిత కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉల్లాస్‌పై వీవోలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. పదిహేనేళ్లు దాటిన స్వయంశక్తి సంఘ మహిళలు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, వంట నిర్వాహకుల్లోని నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే చేపట్టాలన్నారు. ఏపీఎం రమణమ్మ పాల్గొన్నారు.

పాఠశాల చెంతనే చెత్త..



టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్‌టీఆర్ కాలనీలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో విద్యార్థులు, చిన్నారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా కాలనీలో చుట్టుపక్కల వారంతా పాఠశాలకు ఆనుకుని రోడ్డు పక్కనే రోజూ చెత్తను వేయడంతో డంపింగ్‌గా మారుతోంది. పంచాయతీ యంత్రాంగం స్పందించి ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

–టెక్కలి

గుంతల రోడ్డుతో తిప్పలు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ఉన్నటువంటి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్‌రోడ్డు శిథిలమైంది. గుంతలుగా మారడంతో ప్రయాణం కష్టతరంగా మారింది. గురువారం కురిసిన వర్షానికి గుంతలన్నీ నీటితో నిండిపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు.

–కాశీబుగ్గ



తటాకం కాదు..



ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగ గ్రామం వద్ద తారు రోడ్డు చెరువును తలపిస్తోంది. గ్రామం నుంచి వచ్చే మురుగునీరు నిల్వ ఉండటంతో బస్సులు, లారీలు ఈ మార్గంలో వచ్చినప్పుడు పక్కకు ఒరిగి పోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

మూలకు చేరిన పైజో మీటర్

డొంకూరు నుంచి తడా వరకు సుదీర్ఘ సముద్ర తీ రం ఉండటంతో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ వారు 2020న బూర్జపాడు పాఠశాల ప్రాంగణంలో పైజోమీటర్ ఏర్పాటు చేశారు. సముద్ర మట్టం నుంచి ఎత్తు, భూగర్భజలమట్టం, నేల లేదా రాతి లోపల ఉపరితల పైజోమెట్రిక్ స్థాయిని, పునాదులు, కాంక్రీట్ నిర్మాణాలలో రంధ్రాల నీటి పీడనాన్ని కొలవడానికి దీన్ని ఉపయోగిస్తుంటారు. ఈ యంత్రం మూలకు చేరి నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత భూగర్భ జల, జల గణన శాఖాధికారులు స్పందించి ఉపయోగం లోకి తేవాలని స్థానికుల కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్



అసంపూర్తి పనులు..



కంచిలిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణానికి సమీపంలో ఉన్న కంచిలి, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీల పరిధిలో ఉండే రోడ్డు మార్గంలో నిర్మించిన డ్రైనేజీని అసంపూర్తిగా విడిచిపెట్టారు. కంచిలి పంచాయతీ భూభాగం వరకు నిర్మించిన ఈ కాలువ, ఎస్.ఆర్.సి.పురం పంచాయతీ భూభాగంలో నిర్మించలేదు. దీంతో స్థానికంగా ఉన్న ఇళ్లలో నుంచి విడిచిపెట్టిన వాడుకనీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. చిన్న వర్షం కురిసినా ఇక్కడ డ్రైనేజీ నీరంతా రోడ్డు మీదకు చేరి చెత్తంతా చిందరవందరగా పడి ఉంటోంది.

–కంచిలి